## సొంతింటి కల సాకారం దిశగా..

- పైలట్ ప్రాజెక్టుగా రత్నాపూర్ ఎంపిక
- కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు
- విడతల వారీగా నిధులు విడుదల



రత్నాపూర్‌లో స్లాబ్ లెవల్‌కు పూర్తయిన ఇళ్లు

**రామగిరి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక పేదవారి సొంతింటి కలను సాకారం చేయాలన్న ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎన్నికల హామీల్లో ప్రకటించిన విధంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పథకంలో భాగంగా రూ.5లక్షలతో పేదవారికి ఇళ్లు మంజూరు చేస్తోంది. దీంతో పేదల సొంతింటి కల సాకారమవుతున్న వేళ లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**పైలట్ ప్రాజెక్టుగా రత్నాపూర్ ఎంపిక**

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో మండలంలోని రత్నాపూర్‌ను ఎంపిక చేసింది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులను ఎంపిక చేసి 323 ఇళ్లు మంజూరు చేసింది. పంచాయతీ పరిధిలోని లబ్ధిదారులను ఎంపిక చేయగా ప్రస్తుతం 105 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇల్లు లేని నిరుపేద కుటుంబాలు వారికి ఉన్న గుడిసెలను తొలిగించి వాటి స్థానంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు రెండు ఇళ్లు స్లాబ్ వరకు నిర్మాణం పూర్తయ్యాయి. 48 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌కు వచ్చాయి. 8 రూఫ్ లెవల్ వరకు పూర్తయ్యాయి. మిగిలినవి కూడా నిర్మాణం మొదలుపెట్టారు. బేస్‌మెంట్ లెవల్‌కు వచ్చిన లబ్ధిదారులకు అధికారులు ఫొటో తీసిన తర్వాత వారంలో బిల్లు జమ అవుతోందని లబ్ధిదారులు చెప్తున్నారు. ఇప్పటి వరకు 48 మందికి రూ.లక్ష చొప్పున మొదటి విడతల్లో జమ అయినట్లు అధికారులు వెల్లడించారు.

**వేగంగా పనులు..**

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈక్రమంలో ఇప్పటికే బేస్‌మెంట్ వరకు పూర్తయిన నిర్మాణాలకు మొదటి విడత డబ్బులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఇంటి నిర్మాణ పనుల ఆధారంగా విడతల వారీగా డబ్బులు జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పిల్లర్లు మొదలుకొని స్లాబు, గోడలు ఇలా గృహప్రవేశం లోపు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో మొత్తంగా రూ.5లక్షలు ప్రభుత్వం జమ చేస్తుంది. నిర్దేశించిన ప్రకారమే నిర్మాణం చేపట్టాలని, నిబంధనలు పాటించకుండా చేపట్టే నిర్మాణాలకు నిధుల విడుదలలో ఇబ్బందులు తలెత్తే ఆవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు.

### గుడిసెలో ఉండేవాళ్లం



మాకు ఇళ్లు లేక గుడిసెలో ఉండేవాళ్లం. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మాకు ఇల్లు మంజూరు కావడంతో చాలా సంతోషంగా ఉంది. ఇంటి నిర్మాణం ప్రారంభించాం. పంచాయతీ కార్యదర్శి వచ్చి ఫొటోలు తీసుకున్నాడు. రూ.రెండు లక్షలు ఖాతాలో జమయ్యాయి.

– జక్కుల రజిత, రత్నాపూర్

### మంత్రికి రుణపడి ఉంటాం



చాలారోజుల నుంచి ఇళ్లు లేక కిరాయికి ఉంటూ బతుకుతున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇల్లు మంజూరు చేసి మా జీవితంలో వెలుగులు నింపిన మంత్రి శ్రీధర్‌బాబుకు జీవితాంతం రుణపడి ఉంటాం. అధికారులు సూచించిన మేరకు ఇంటి నిర్మాణం చేపడుతున్నాం.

– రేగళ్ల తిరుమల, రత్నాపూర్

### ఆన్‌లైన్‌లో నమోదు



ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి విడతలో రత్నాపూర్‌ను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి అర్హులకు ఇళ్లు మంజూరు చేశాం. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం నిర్మించి అధికారులకు సహకరించాలి. నిర్మాణం జరిగిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం.

– బద్రి శైలజారాణి, ఎంపీడీవో

## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

**ఓదెల:** మండలంలోని కనగర్తిలోని దాసరి పద్మహన్మయ్య పాఠశాలకు చెందిన విద్యార్థులు సుల్తానాబాద్‌లో జరిగిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. అండర్–14లో ముద్దమల్ల అజయ్ (ట్రయాథ్లాన్‌లో గోల్డ్‌మెడల్), సిద్ది వినాయక్ (సిల్వర్‌మెడల్), అండర్–12 విభాగంలో శశాంత్(60మీటర్ల రన్‌లో సిల్వర్ మెడల్), బాలికల విభాగంలో దాసు జయశ్రీ (జావెలిన్ త్రోలో గోల్డ్ మెడల్) ప్రతిభ కనబరిచారు. హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ఎంఈవో ఎర్ర రమేశ్ పేర్కొన్నారు.

### డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



**ధర్మారం:** మండలంలోని నందిమేడారం ఎస్సీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. ఎమ్మెల్యే, మంత్రి లక్ష్మణ్‌కుమార్ సహకారంతో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.8లక్షల నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులను ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కాలనీవాసుల సమస్య పరిష్కారం కోసం మంత్రి నిధులు మంజూరు చేయడంతో ఒకటో వార్డు నుంచి రెండో వార్డు వరకు డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మాజీ ఉపసర్పంచు కట్ల రమేశ్, తదితరులు ఉన్నారు.

### పాత నేరస్తుల కదలికలపై నిఘా



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై స్వామి

**పాలకుర్తి:** బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత నేరస్తుల కదలికలపై పోలీసుల నిఘా ఉంటుందని స్థానిక ఎస్సై స్వామి తెలిపారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలకుర్తి, ఈసాలతక్కళ్ళపల్లి గ్రామాలకు చెందిన పాత నేరస్తులు, అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. స్థానికులను అడిగి వారి ప్రవర్తన తీరును తెలుసుకున్నారు. వారి కుటుంబం, మానసిక, ఆర్థిక పరిస్థితుల గురించి అడిగి తెలుసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. గతంలో నేరాలకు పాల్పడిన వారు తమ ప్రవర్తనను మార్చుకోవాలని సూచించారు. ఆయన వెంట కానిస్టేబుల్ సురేశ్ ఉన్నారు.

### ఆక్సిజన్ సిలిండర్ అందజేత



ఆక్సిజన్ సిలిండర్ అందజేస్తున్న రాహుల్‌గౌడ్

**ఓదెల:** మండలంలోని పొత్కపల్లికి చెందిన గంగారపు రాజమ్మ అనే మహిళ ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతోంది. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరిశేటి రాహుల్‌గౌడ్ ఆక్సిజన్ సిలిండర్‌ను ఆదివారం అందజేశాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాజమ్మ పరిస్థితిని చూసి ఆక్సిజన్ సిలిండర్ అందజేసిన రాహుల్‌ను స్థానికులు అభినందించారు.

### ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

**సుల్తానాబాద్:** మండల కేంద్రంలోని గొల్లపల్లి (యాదవ నగర్)లో వరినాట్లు వేస్తున్న పొలం వద్ద ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయరమణారావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బండ మాధవి, మేకల స్వప్న, గెల్లు వనిత, దాసరి శంకరమ్మ, బోయిన సువర్ణ ఉన్నారు.

### నేడు పౌరహక్కుల దినోత్సవం

**ఎలిగేడు:** మండలంలోని బుర్హాన్‌మియాపేటలో సోమవారం ఉదయం 10.30గంటలకు పౌరహక్కుల దినోత్సవం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ యాకన్న తెలిపారు.



**గోదావరిఖని:** స్థానిక 9వ డివిజన్‌లోని రోడ్లు అధ్వానంగా మారాయి. జనగామలోని ప్రభుత్వ హాస్పిటల్‌కు వెళ్లే రోడ్డు నాణ్యత లోపంతో గుంతలు పడి బురదమయంగా మారింది. వర్షం వస్తే రోడ్డు మీద నీరు నిలుస్తోంది, దీంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సీసీరోడ్డుకు మరమ్మతు చేయాలి. – తొడుపునూరి రమేశ్‌కుమార్, 9వ డివిజన్

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

## భగవద్గీత అనుబంధ గ్రంథాల ప్రచారం



ఇంటింటా భగవద్గీత ప్రచారం

**రామగుండం:** జూలై 10న వచ్చే గురుపౌర్ణమిని పురస్కరించుకొని అంతర్గాం మండల పరిధిలోని ముద్దిర్యాలలో ఆదివారం లక్షెట్టిపేటకు చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక, కొడిమ్యాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గురుపౌర్ణమి రోజు శ్రీకృష్ణ భగవానుడిని మాత్రమే జగద్గురువుగా ఎందుకు పూజించాలో వివరించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక, కొడిమ్యాల్ కమిటీల అధ్యక్షుడు ఆర్.రాజు, రాకేశ్, ఎం.రాజు, రవళి, రష్మిత, శివ, సాహిత్, అనుతేజ్, వేణుగోపాల్, రవళి, రాజశేఖర్, ప్రసాద్, రూపక్, రాజు రవి, సునీత, నవీన్, స్వాతి పాల్గొన్నారు.

## ఈర్ల కొమురయ్యను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

**పెద్దపల్లిరూరల్:** ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి కోసం పనిచేసిన ఈర్ల కొమురయ్యకు కాంగ్రెస్ రాష్ట్ర కమిటీలో చోటు కల్పించడం సరికాదని, వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆదివారం పెద్దపల్లిలో జరిగిన సమావేశంలో పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ అభ్యర్థి ఓటమి కోసం ప్రత్యర్థి పార్టీలతో కలిసి పనిచేసిన కొమురయ్యకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలకు తెలియకుండా రాష్ట్ర కమిటీలో చోటు కల్పించి కార్యకర్తల మనోభావాలను దెబ్బతీయొద్దని సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాశ్‌రావు, మాజీ చైర్మన్ మహేందర్ తదితర నాయకులు అన్నారు. ఈ అంశాన్ని పార్టీ అధిష్టానానికి చెప్పాలని పార్టీ పరిశీలకులకు విన్నవించారు.

**విజయరమణారావుకు మంత్రి పదవి ఇవ్వాలి**

పెద్దపల్లి నియోజకవర్గ చరిత్రలో ఇప్పటివరకు ఎవరికీ మంత్రి పదవి ఇవ్వలేదని, ప్రజాభిమానం గల నాయకుడు ఎమ్మెల్యేగా ఎన్నికైన విజయరమణారావుకు మంత్రిమండలిలో అవకాశం కల్పించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రి పదవి అంశాన్ని ప్రస్తావిస్తుండగా ఎమ్మెల్యే వారిని వారించారు. తాను మంత్రి పదవి కోరుకోవడం లేదు..సీఎం రేవంత్‌రెడ్డి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి



పెద్దబొంకూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన గద్దెపై మాయమైన అంబేడ్కర్ విగ్రహం

**పెద్దపల్లిరూరల్:** పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌లోని ప్రధాన చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం ప్రారంభం కాకముందే అదృశ్యమైంది. మండలంలోని కొత్తపల్లి నుంచి ఇటుకబట్టీలకు చెరువుమట్టిని తరలించే టిప్పర్ విగ్రహాన్ని ఢీకొనడంతో విరిగిపోయింది. దీంతో స్థానిక నేతలతో బట్టీ యజమానులు చర్చించినట్టు సమాచారం. కానీ మళ్లీ అంబేడ్కర్ విగ్రహాన్ని అదే కూడలిలో ఏర్పాటు చేసే పనులు ప్రారంభించకపోవడంపై గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. వీలైనంత త్వరగా విగ్రహం ఏర్పాటు చేసి ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మంత్రిపై అసత్య ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న తిరుపతి

**రామగిరి:** రాష్ట్రాభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అసత్య ఆరోపణలు మానుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్ అన్నారు. రామగిరి మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీధర్‌బాబు హయాంలో మంథని నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంటే పుట్ట మధు రాజకీయ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందన్న అక్కసుతో ఇష్టారీతిన మాట్లాడుతున్నారన్నారు. ప్రజలే తన కుటుంబంగా భావిస్తున్న మంత్రిపై అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. నాయకులు ఎల్లె రామ్మూర్తి, ఎస్ఎస్ అన్వర్, తీగల సమ్మయ్య, ఎరుకల బాబురావు, గౌరై నరేశ్‌యాదవ్, అంబీరు శ్రీనివాస్, ఇనగంటి చిన్నారావు పాల్గొన్నారు.

## ఆలయ హుండీలో విదేశీ కరెన్సీ



డాలర్లు చూపెడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

**కాల్వశ్రీరాంపూర్:** మండలంలోని మొట్లపల్లి శ్రీలక్ష్మీ గణపతి సుబ్రహ్మణ్యస్వామి సహిత శివాలయంలో విదేశీ కరెన్సీ దర్శనమిచ్చాయి. ఆలయ కమిటీ నేతృత్వంలో ఆదివారం హుండీ లెక్కింపు చేపట్టారు. అందులో ఓ భక్తుడు వేసిన డాలర్లు దర్శనమిచ్చా యి. ఆలయ కమిటీ చైర్మన్ దొమ్మటి రవి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. వైస్ చైర్మన్ జంగ ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రూపిరెడ్డి మోహన్‌రెడ్డి, ఆలయ అర్చక పురోహితులు నిట్టూరు సతీశ్ శర్మ, మాజీ సర్పంచులు తుల మనోహర్‌రావు, గోనె శ్యామ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు స్కిల్డ్ వేతనాలివ్వాలి



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

**గోదావరిఖని:** కోల్ షాంప్లింగ్ కాంట్రాక్టు కార్మికులకు స్కిల్డ్ వేతనాలివ్వాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. బీఎంఎస్ కేంద్ర కార్యాలయంలో కాంట్రాక్టు కార్మికులతో ఆదివారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ సింగరేణివ్యాప్తంగా పనిచేస్తున్న కోల్ షాంప్లింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు స్కిల్డ్‌వేతనాలు చెల్లించాలని, డిప్యూటీ సెంటర్ లేబర్ కమిషనర్ వద్ద 2022 సెప్టెంబర్ 26న చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 8గంటల పని విధానం అమలు చేయాలని, కోల్ షాంపిలర్స్‌తో చట్ట విరుద్ధమైన పనులు చేయించడం మానుకోవాలని కోరారు. నాయకులు గుండెబోయిన భూమయ్య, గొడుగు సమయ్య, సుంకరి సురేశ్, పినపాక జగదీశ్, పనిగంటి అశోక్, పాలడుగుల వినయ్, గడ్డం సురేశ్, గూడెపు వినోద్, వేల్పుల సతీశ్ పాల్గొన్నారు.

## డ్రైనేజీలను ప్రతీరోజు శుభ్రం చేయాలి



ప్రజలతో మాట్లాడుతున్న సంధ్యారాణి

**యైటింక్లయిన్‌కాలనీ:** వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు రాకుండా మున్సిపల్ సిబ్బంది ప్రతీరోజు డ్రైనేజీలను శుభ్రం చేయాలని బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి కోరారు. పార్టీ పిలుపు మేరకు కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 15వ డివిజన్ రాజీవ్‌నగర్ తండాలో ఆదివారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కాలనీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శశికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మూకిరి రాజు, శ్రీను, లింగం నాయక్, కుమార్, వెంకటేశ్, క్రాంతికుమార్, ప్రణీత్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

**రామగిరి:** మండలంలోని కల్వచర్ల శ్రీవిద్యాభారతి ఉన్నత పాఠశాలలో 2001–02లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కల్వచర్ల లక్ష్మీగార్డెన్స్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం మాజీ సర్పంచ్ గంట పద్మ, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు కేశెట్టి శ్రీనివాస్, శ్యాంసుందర్, కుమార్‌స్వామి, నీరజ, పూర్వ విద్యార్థులు కొప్పుల సునీల్, జవాజి శ్రీనివాస్, రోడ్డ ప్రభాకర్, వేముల సత్యనారాయణ, కుమార్‌స్వామి, రాజమౌళి, తిరుపతి, సతీశ్, రాజమణి, సుప్రియ, రజిత పాల్గొన్నారు.

## బిల్లా శ్రీదేవికి ఇంటర్నేషనల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న బిల్లా శ్రీదేవి

**జ్యోతినగర్:** రామగుండం ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీకి చెందిన బిల్లా శ్రీదేవి సామాజిక సేవ చేస్తూ మహిళలకు స్ఫూర్తిగా నిలిచారని అభినందిస్తూ ఇటీవల హైదరాబాద్‌లో స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో సంస్థ భారతీయ నారీశక్తి ఇంటర్నేషనల్ అవార్డుతో సత్కరించింది. అంతర్జాతీయ అవార్డు అందుకున్న బిల్లా శ్రీదేవిని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గోలివాడ చంద్రకళ, మద్దెల దినేశ్, కంది సుజాత, ఇందారపు సునీత, జక్కెన శ్రీలత, సరిత, జమున, వనిత, రమ, మమత, రాజేశ్వరి, భాగ్యలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

**స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి**

**కాల్వశ్రీరాంపూర్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు సత్తా చాటాలని ఆ పార్టీ మాజీ ఎంపీటీసీ గూడెపు జనార్దన్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. నాయకులు దమ్మని అశోక్, పంజాల సతీశ్, వెంకటేశ్వర్లు, చంద్రమౌళి, రాజు, నరేశ్, రమేశ్, ఓదెలు, శంకరాచారి, రాజన్న, ఎండీ రఫీ, బాలకృష్ణ, నిర్మల, మహేందర్, వెంకన్న, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**• ప్రభుత్వ పాఠశాలకు బెంచీలు వితరణ**

**కాల్వశ్రీరాంపూర్:** మండలంలోని ఉషనపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు విశాఖ చారిటబుల్ ట్రస్ట్ 40 బెంచీలు అందజేసింది. పాఠశాలలో ఫర్నిచర్ కొరత విషయమై కార్మికశాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్‌దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి బెంచీలను పంపిణీ చేశారని హెచ్ఎం వీరుల సమ్మయ్య తెలిపారు.

**• ఉద్యోగ విరమణ సన్మానం**

**సుల్తానాబాద్:** ప్రభుత్వ ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న అమిరిశెట్టి శారదను మండల కేంద్రంలోని యశోద నరహరి ఫంక్షన్‌హాల్‌లో డీపీవో వీర బుచ్చయ్య సన్మానించారు. రిటైర్డ్ ఐపీఎస్ ఉప్పు తిరుపతి, షేక్, డీఈ మధుమతి, ఎంఈవో రాజయ్య, సురేందర్, వీరగోని పెంటయ్య, వీర తిరుపతి, దేవేందర్, శ్రీనివాస్, అమిరిశెట్టి తిరుపతి, రాజలింగం ప్రేంచందర్ రావు, దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**• విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్**

**గోదావరిఖనిటౌన్:** విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని ఎమ్మెల్యే సతీమణి మనాలీఠాకూర్ అన్నారు. స్థానిక అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్‌లో గురువారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, ట్రస్మా నాయకులు అదర్ సండే సమ్మారావు, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ సూర్యదేవర వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**• సమాజ సేవలు స్ఫూర్తిదాయకం**

**జ్యోతినగర్:** సమతా సైనికదళ్ రాష్ట్ర నాయకులు, సమతా ఫౌండేషన్ నిర్వాహకులు దుర్గం ప్రమీల–నగేష్ దంపతుల సేవలు స్ఫూర్తిదాయకమని ప్రముఖ కవి, రచయిత, స్నేహ సాహితీ గ్రంథాలయ నిర్వాహకులు ఏలేశ్వరం వెంకటేశ్ అన్నారు. ఇటీవల దుర్గం ప్రమీల–నగేష్ దంపతులు ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీలో నూతనంగా ప్రారంభించిన సమతా గ్రంథాలయానికి ఆదివారం ఆయన కొన్ని పుస్తకాలు అందజేశారు.

**• బులియన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక**

**గోదావరిఖనిటౌన్:** గోదావరిఖని బులియన్ అండ్ జువెల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం రాత్రి స్థానిక అడ్డగుంటపల్లిలోని ఎస్ఎస్ బాంకెట్ హాల్‌లో బ్యాలెట్ పద్ధతిలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుగ్గిళ్ల రవీంద్రచారి, ప్రధాన కార్యదర్శిగా పల్లెర్ల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సునీల్ జాదవ్, సెక్రటరీగా మామిడిపల్లి శ్రీధర్, కోశాధికారిగా నల్లమాసు రాజన్న, సహ కోశాధికారిగా శేగంటి నరేశ్, ఉపాధ్యక్షుడిగా నార్ల ప్రసాద్, గుంత వినోద్, హనుమాన్ యాదవ్, జ్యోతిరాం పాటిల్, విజయగిరి సదానందంతో పాటు మిగతా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

## నిరుపయోగంగా మరుగుదొడ్లు



**జూలపల్లి:** మండల కేంద్రంలోని బస్టాండులో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లు నిర్వహణ లేక చెట్లతో నిండి శిథిలావస్థకు చేరాయి. ఇటీవల బస్టాండుకు రంగుల వేసి బస్సులు నడుపుతున్న ఆర్టీసీ అధికారులు మరుగుదొడ్లను మాత్రం మరిచారని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## పోచమ్మవీధిలో వానరాల బీభత్సం



వీధుల్లో గుంపులుగా కోతులు

**రామగుండం:** పట్టణంలోని పోచమ్మ వీధిలో ఆదివారం పెద్ద ఎత్తున వానర సైన్యం సంచరించడంతో కాలనీవాసులు ఆందోళనకు గురయ్యారు. ఇళ్లలోకి చొరబడుతూ పాదచారులు, వాహనదారులపై ఎగబడుతూ బీభత్సం సృష్టించాయి. చెత్తకుండీల్లోని వ్యర్థాలను చిందరవందర చేస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేశాయి. దీనిపై కార్పొరేషన్ కమిషనర్ స్పందించి కోతులను బంధించి అటవీ ప్రాంతాలకు స్థానికులు కోరుతున్నారు.